క్లుప్తంగా

రాస పోలమాంబకు విశేష పుష్పాలంకరణ



పుష్పాలంకరణలో అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాస పోల మాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం తులసి మాలలు, చిట్టి గులాబీలు, జాజి మల్లెలు, బంతి పువ్వులతో అలంకరించారు. విశేష అలంకరణకు గ్రామానికి చెందిన చిల్ల శ్రీను, రమణమ్మ దంపతులు తోడ్పాటునందించారు. తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

హెచ్చరికలు బేఖాతర్



సర్వీస్‌రోడ్డులో కట్టిన కర్రల కింద నుంచి వెళ్లిపోతున్న ద్విచక్రవాహనదారులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు బంగ్లామెట్ట పక్కనుంచి సర్వీస్‌రోడ్డులో సోమవారం నుంచి రాకపోకలు నిషేధించారు. ఇటీవల వర్షాలకు మెట్టపై నుంచి రాళ్లు, గ్రావెల్ రోడ్డుపైకి జారిపడుతున్నందున ఈ మార్గంలో వాహనాలు రాకుండా స్టాపర్లు ఏర్పాటు చేయడంతో పాటు అడ్డంగా కర్రలు కట్టారు. అయినప్పటికీ చాలామంది స్టాపర్లను పక్కకు తప్పించి, రహదారికి అడ్డంగా కట్టిన కర్రల కింద నుంచి వాహనాలను తప్పించుకుని వెళ్తున్నారు. ప్రమాదాలు జరిగితే హెచ్చరికలు బేఖాతర్ చేసినవారు మూల్యం చెల్లించుకోక తప్పదని స్థానికులు అంటున్నారు. జీవీఎంసీ, పోలీసులకు సహకరించాలని కోరుతున్నారు.

పోతినకు అభినందనలు



శ్రీనివాసరావును అభినందిస్తున్న నాయకులు

మధురవాడ: వైఎస్సార్‌సీపీ నగరాలు విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన పోతిన శ్రీనివాసరావును వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు నాయకులు అభినందించారు. కార్‌షెడ్ సమీపంలోని పాత పీఎం పాలెంలో గల ఆయన నివాసానికి వెళ్లిన వారు దుశ్శాలువాలు కప్పి, అభినందనలు తెలియజేశారు. అభినందనలు తెలిపిన వారిలో ఏపీ నగరాలు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు కె.రామ్మోహనరావు, పిల్ల ఆనంద్ తదితరులు ఉన్నారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార : బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు నాలుగో పట్టణ పోలీసులు తెలిసిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెం రామచంద్రనగర్‌కి చెందిన 11 సంవత్సరాల బాలిక ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి అడ్డుకుని చెయ్యి పట్టుకుని బలవంతంగా బైకు పైకి ఎక్కించడానికి ప్రయత్నించాడు. దీంతో భయపడిన బాలిక అతని బారి నుంచి తప్పించుకుని ఇంటికెళ్లి తల్లిదండ్రులకు విషయం వివరించింది. వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే స్థానికులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఫోక్సో చట్టం సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో మహిళా ఎస్‌ఐ ప్రమీల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు విజయనగరం జిల్లా జామికి చెందిన ఎర్రినాయుడు(45)గా గుర్తించారు.

వేట సాగక.. పూట గడవక..

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు మత్స్యకారుల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. వేట సాగక, పూట గడవక కష్టాల కడలిలో ఆటుపోట్ల మధ్య వారి జీవనం భారంగా సాగుతోంది. ప్రకృతి ప్రకోపించినా.. అండగా ఉండాల్సిన ప్రభుత్వమూ చేయూతనివ్వకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

- కష్టాల కడలిలో గంగపుత్రులు
- తరచూ ప్రకృతి వైపరీత్యాలతో మత్స్యవేటకు దూరం
- అందని ప్రభుత్వ భరోసా



ఉప్పాడ వద్ద తీరానికి పరిమితమైన వలలు



తీరానికి పరిమితమైన బోట్లు

కొమ్మాది: మత్స్యకారులకు వేటే జీవనాధారం. ఒడిదుడుకులెన్ని వచ్చినా.. ఎదురీది నిలబడగల కష్టజీవులు. వీరి జీవితంలో ఆటుపోట్లు నిరంతర ప్రక్రియ. గంగమ్మను నమ్ముకున్న బతుకులు వారివి. అలాంటివారిపై ప్రకృతి ఒకవైపు, ప్రభుత్వం మరోవైపు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. దీంతో, వేట లేక పూట గడవక మత్స్యకారులు పస్తులుండాల్సిన పరిస్థితి.

సముద్రంలో వేట నిషేధ సమయం ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకు రెండు నెలల పాటు మత్స్యకారులు వృత్తికి దూరమై ఇంటికే పరిమితమయ్యారు. నిషేధ కాలం పూర్తయ్యేసరికి ప్రకృతి పరీక్ష పెడుతోంది. జూలై, ఆగస్టులలో రెండు సార్లు తుపాన్లు, సముద్రంలో వాయుగుండం కారణంగా 15 రోజుల పాటు వేటకు దూరమయ్యారు. తాజాగా వారం రోజుల నుండి కురుస్తున్న వర్షాల కారణంగా మత్స్యకారులు సముద్రానికి దూరంగా ఉన్నారు. ప్రస్తుతం వరదల కారణంగా సముద్రం పెద్ద ఎత్తున ఎగసి పడటంతో మరో వారం రోజుల పాటు వేటకు వెళ్లలేని పరిస్థితి.

పట్టించుకోని ప్రభుత్వం

వేట నిషేధ సమయంలో ప్రభుత్వం మత్స్యకారులకు విరామ భృతి రూ. 10వేలు అందించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మత్స్యకార భరోసాకు మంగళం పాడింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ. 20వేలు విరామ భృతి ఇస్తామని మత్స్యకారులపై ప్రభుత్వం ఆశల వల విసిరింది. తీరా అధికారంలోకి వచ్చాక అసలు భరోసా ఊసే మరిచిపోయింది. ఆరు నెలల నుండి వాయుగుండాలతో పోరాటం చేస్తూ, వేటవిరామంతో పస్తులు ఉంటూ అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నా మత్స్యకారులు.

రుషికొండ తిమ్మాపురం, మంగమారిపేట, కాపులదిబ్బడపాలెం, చేపలుప్పాడ తీరప్రాంతంలో వందలాది మత్స్యకార కుటుంబాలు వేటను నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నాయి. మత్స్యకార భరోసా దేవుడెరుగు.. కనీసం తుపాను సమయంలోనైనా తాము ఎలా ఉన్నామో చూడటానికి ఒక్క ప్రజా ప్రతినిధికూడా రాలేదని ఇక్కడ మత్స్యకారులు వాపోతున్నారు. వరుస తుపాన్లతో బతుకే భారంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉండి ఉంటే రూ. 10వేలు చొప్పున మత్స్యకార భరోసా తమ ఖాతాల్లో పడేవని, తుపాను సమయాల్లోనూ ఆదుకునేవారని గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మత్స్యకార భరోసా అందించి, ఆదుకోవాలని కోరుతున్నారు.



మంగమారిపేట వద్దే ఉంచేసిన వలలు, బోట్లు

వరుస తుపాన్లతో అవస్థలు



అన్ సీజన్ తరువాత ఎన్నో ఆశలతో వేటకు సిద్ధమయ్యాం. అయితే వరస తుపాన్లు రావడంతో ఈ మూడు నెలల నుండి మేము ఇంటికే పరిమితమయ్యాం. ఓ వైపు వేట సాగడం లేదు, మరోవైపు మత్స్యకార భరోసా అందలేదు. పస్తులతో బతకాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం వేట విరామ భృతిని అందించి ఆదుకోవాలి. – గనగళ్ల రాము, మత్స్యకారుడు

ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాం



ఏప్రిల్‌లో అన్‌సీజన్ మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు వేటకు దూరంగా ఉన్నాం. అప్పులు చేసుకుని కుటుంబాన్ని నెట్టుకుని వస్తున్నాం. వేటకు వెళ్లలేక, వేరే పని చేయలేక దిక్కుతోచని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నాం. నాయకులు, ప్రజా ప్రతినిధులు ఒక్కసారి మా ప్రాంతాలకు వచ్చి చూస్తే మా దుర్భర జీవితాలు వారికి అర్థమవుతాయి. – మేరుగు ఎల్లాజీ, మత్స్యకారుడు

ప్రభుత్వం ఆదుకోవాలి



వరుస తుపాన్లతో వేటకు వెళ్లక, పూటగడవడం కష్టంగా మారింది. కుటుంబాన్ని పోషించడం భారంగా మారింది. మత్స్యకారుల కష్టాలు తెలుసుకుని ప్రభుత్వం ఆదుకోవడానికి ముందుకు రావాలి. మత్స్యకార భరోసాతో పాటు తుపాను సమయంలో వేటకు వెళ్లలేక, నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలి. – మైలపిల్లి పోలోడు

బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు

తగరపువలస: నేపాల్‌లో ఈ నెల 4 నుంచి 8 వరకు జరిగిన 3వ భారత్ బాక్సింగ్ ఫెడరేషన్, ఇండియన్ నేపాల్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో భీమిలికి చెందిన గ్రామీణ విద్యార్థులు 17 మంది బంగారు పతకాలు, ఒకరు కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా దివీస్ లేబరేటరీలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు దేవేందర్‌రావు, ఎల్.వి. రమణ, జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ పోటీలకు ఎంపికైన 17 మందికి ప్రవేశరుసుం, ప్రయాణ ఖర్చుల కింద ఒక్కొక్కరికి రూ.35 వేలు చొప్పున అందించామన్నారు. వీరిలో 16 మంది బంగారు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. కోచ్ ఆదినారాయణ, చిప్పాడ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎం.వి.టి.రత్నంను అభినందించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ విభాగం మేనేజర్ డి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీకి చెందిన కోరాడ నీలిమ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించడంపై ఆమెను స్థానిక నాయకులు అభినందించారు. సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు తదితరులు అభినందనలు తెలియజేశారు.



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దివీస్ యాజమాన్యం

ఆక్రమణలకు అడ్డుకట్ట వేద్దాం



మాట్లాడుతున్న కనకమహాలక్ష్మి

భీమునిపట్నం: భీమిలి జోన్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు, చెరువులు, వాగుల ప్రాంతాల్లో నిర్మాణాలు జరగకుండా అందరూ తమ వంతు సహకారం అందించాలని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి కోరారు. నీటివనరులు, భూ ఆక్రమణలపై పొదుపు సంఘాల మహిళలతో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇలా ఆక్రమణలకు పాల్పడితే భారీ వర్షాలు పడే సమయాల్లో ఎంతటి ప్రమాదాలు జరుగుతున్నాయో అందరూ చూస్తున్నదే అన్నారు. ఇకపైన ఇటువంటివి జరగకుండా అందరూ జాగ్రత్త వహించాలని సూచించారు. ఇందుకోసం తమ ప్రాంతాల్లో వారికి అవగాహన కల్పించడంతో పాటు ఇలా చేస్తే చర్యలు గట్టిగా ఉంటాయని హెచ్చరించాలని తెలిపారు. సమావేశంలో అధికారులు లక్ష్మి, సంతోష్‌కుమార్, ఫణిరాం, రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం స్వాధీనం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు బీచ్ రోడ్డు తిమ్మాపురంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ సర్వే నంబరు 346/2 లో కొంతమంది రైతులు కొద్ది సంవత్సరాలుగా గేదెలను, మేకలను కట్టుకుని వాడుకలో ఉన్నారు. అయితే ఇటీవల వీరు ఈ స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేయడం, పాకలు వేయడంతో.. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఆక్రమణలకు అడ్డుకట్ట వేశారు. సుమారు మూడు ఎకరాల్లో కంచెలను, పాకలను తొలగించి ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు ఆర్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో అనేక ఆక్రమణలు ఉన్నాయని, వీటిని పరిశీలించి త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

పంట నష్టం పరిశీలన

తగరపువలస: ఇటీవల భారీ వర్షాలకు భీమిలి మండలంలో నీట మునిగిన వరిపొలాలను ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను మంగళవారం పరిశీలించారు. మండలంలో టి.నగరపాలెం, తాటితూరు, శింగనబంద, మజ్జిపేట పంచాయతీలలో నష్టం ఎక్కువగా సంభవించినట్టు రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఒక్క నగరపాలెంలోనే 25 ఎకరాల వరి పంట నీట మునిగిందన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి రైతులకు త్వరగా నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వాసురాజు ఆదేశించారు. మండలంలో మిగిలిన పంచాయతీలలో కూడా పర్యటించి రైతుల కష్టాలు తెలుసుకుంటామన్నారు. ఎంపీటీసీ చెల్లూరి నగేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, మద్దిల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



టి.నగరపాలెంలో మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న ఎంపీపీ వాసురాజు, శ్రీను

జీవించి సాధించాలి

భీమునిపట్నం: జీవితం ఎంతో విలువైందని, దానిని వృథా చేసుకోకూడదని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) వైస్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు అన్నారు. సమస్యలెదురైనప్పుడు కుంగిపోక, ధైర్యంగా నిలబడి సాధించాలన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా సంవత్సరానికి ఎనిమిది లక్షలమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇది ఎంతో బాధాకరమైన విషయమని అన్నారు. కొన్ని సందర్భాలలో బలహీనమైన మనస్సు ఉన్నవారికి ఈ సమస్య వస్తుందని, అలా వచ్చినప్పుడు తమ సన్నిహితులతో ఆ ఇబ్బంది, సమస్యల గురించి చర్చిస్తే ఇటువంటి పరిస్థితులు తలెత్తవని అన్నారు. ఎటువంటి ఒత్తిడులు, సమస్యలు వచ్చినా ఆలోచించి వాటి పరిష్కార మార్గాలను చూడాలి తప్ప, అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకోకూడదని హితవు పలికారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్.సుధాకర్, నాగేశ్వరరావు, సోమయాజులు, మహాలక్ష్మి, త్రినాథరావు, నీలిమ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మహత్యలపై ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఛాత్రోపాధ్యాయులు

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



కృష్ణాపురంలో ప్రచారం చేస్తున్న సభ్యులు

పద్మనాభం: త్రైత సిద్ధాంత భగవద్గీతపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు మంగళవారం కృష్ణాపురంలో ప్రచారం చేశారు. భగవద్గీత ఆవశ్యకత గురించి వారు వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు జి.కృష్ణ సూరప్పడు, వి.సురేష్, ఎస్.శ్రీనివాసరావు, బి.రమాదేవి, కె.రాజు, భారతి పాల్గొన్నారు.


కొండపోరంబోకు కబ్జాకు టీడీపీ నాయకుల యత్నం

తగరపువలస: ఆనందపురం మండలం ముకుందపురం పంచాయతీలోని సర్వే నంబర్ 121లో గల మూడెకరాల కొండ పోరంబోకు స్థలం కబ్జాకు స్థానిక టీడీపీ నాయకులు మూడు రోజులుగా ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాంతంలో స్థలాన్ని శుభ్రం చేసి మామిడి, నీలగిరి వంటి మొక్కలు వేసేందుకు తెర వెనుక ఉండి స్థానికంగా ఉన్నవారిని నియమించారు. దీనికి స్థానిక వీఆర్వో సహకరిస్తున్నట్టు ఆరోపణలు రావడంతో తహసీల్దార్ కార్యాలయం నుంచి అధికారులు స్పందించారు. అప్పటికే పంచాయతీకి చెందిన పలువురు తహసీల్దార్, డీటీకీ కూడా ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన వారు ఆక్రమణకు ప్రయత్నించిన విషయం వాస్తవమేనన్నారు. కబ్జాకు ప్రయత్నించిన వారు నాటిన మొక్కలు తొలగింపచేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ స్థలం విలువ రూ.4.50 కోట్లు ఉంటుందని అంచనా.



ముకుందపురంలో టీడీపీ నాయకులు కబ్జాకు చదును చేసిన కొండపోరంబోకు స్థలం

ఏకదంతాయ.. వక్రతుండాయ



వలందపేట రజకవీధిలో కొలువుతీరిన పార్వతీపుత్రుడు



విశేష అలంకరణలో విజయ గణపతి

ఏకదంతాయ వక్రతుండాయ గౌరీ తనయాయ ధీమహి.. అంటూ వాడవాడలా కొలువుదీరిన విఘ్ననాయకుడిని భక్తిశ్రద్ధలతో అర్చిస్తున్నారు నియోజకవర్గవాసులు. గణపతి నవరాత్రి మహోత్సవాలు అంతటా కనులపండువగా జరుగుతున్నాయి. మధురవాడ గణేష్‌నగర్‌లోని శ్రీ విజయ గణపతి పంచాయతన దేవాలయంలో ప్రతి రోజూ విశేష అలకంరణ, అర్చనలతో పాటు అష్ట ద్రవ్యములతో గణపతి హోమం నిర్వహిస్తున్నారు. స్వామి వారికి శనివారం వనంతోత్సవం జరిపించనున్నట్లు అర్చకులు తెలిపారు. నగరంపాలెంలో కొలువుదీరిన పర్యావరణ గణపతి విశేషంగా ఆకట్టుకుంటున్నారు.

– మధురవాడ/తగరపువలస



నగరంపాలెంలో పూజలందుకుంటున్న పర్యావరణ గణపతి

స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే కుట్రలు ఆపాలి

సిటూ ఆధ్వర్యంలో ప్రజా, కార్మిక సంఘాల నిరసన

మధురవాడ: ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే కుట్రలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మానుకోవాలని సీఐటీయూ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ప్రజా, కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మధురవాడ జోనల్ కార్యాలయం ఎదురుగా గల హైవే సర్వీసు రోడ్డులో మంగళవారం నిరసన తెలిపారు. దీంతో రాకపోకలకు కాసేపు ఇబ్బంది కలిగింది. పీఎం పాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి చక్కదిద్దారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే కుట్రలకు పూనుకుందని, ఇది రాష్ట్రానికి అన్యాయం చేయడమే అవుతుందని అన్నారు. బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మధురవాడ జోన్ నాయకులు పి.రాజ్‌కుమార్, డి.అప్పలరాజు, జి.మంగశ్రీ, లక్ష్మణ, రవి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలి

తగరపువలస: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా భీమిలి డివిజన్ సిటూ నాయకులు స్థానిక మెయిన్‌రోడ్డులో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రవ్వ నరసింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని మోదీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడవలసిన ప్రభుత్వమే ప్రైవేట్‌పరం చేయడం సరికాదని, దీనిని ప్రజాసంఘాలన్నీ వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. కేంద్రం వైఖరి మార్చుకోకుంటే ప్రజలే కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెపుతారని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం ద్వారా స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో నమ్మి నాయుడు, పల్లా పెంటరాజు, జోగ వెంకటరావు, పల్లా రమణ, పల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తగరపువలస మెయిన్‌రోడ్డులో నిరసన తెలుపుతున్న సిటూ నాయకులు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

పద్మనాభం: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తుపాను వల్ల గ్రామాలు చిత్తడిగా మారి పారిశుధ్యం క్షీణిస్తోందన్నారు. 22 పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపరచి అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. డ్రైనేజీల్లో పూడిక తీయాలని, బోరుబావులు, వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని సూచించారు. గ్రామాల్లో వీధి లైట్లు నిర్విరామంగా వెలగకుండా ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఈవోఆర్డీ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

15న మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

తగరపువలస: సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకలలో భాగంగా ఈ నెల 15న చిట్టివలస సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో 95వ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 5 గంటలకు ఓంకార సుప్రభాత సహిత నగర సంకీర్తన, 6.30కు శోభాయాత్ర, 7 గంటలకు ప్రశాంతి పతాకావిష్కరణ, 7.15కు గోమాత పూజ, 7.30కు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నారు. ఉదయం 8.15 నుంచి చిట్టివలస శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణమండపంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. వివరాలకు జోన్ కో–ఆర్డినేటర్ ఎం.వి.వి.సాయికుమార్‌ను 96526 36216లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

కొండవాలు ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటన

తగరపువలస: ఎడతెరిపి లేని వర్షాల కారణంగా కొండపై నుంచి మట్టి, రాళ్లు జారిపడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. జీవీఎంసీ రెండోవార్డు సత్యనారాయణపేట కొండవాలు ప్రాంతంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల వర్షాలకు ముందు జాగ్రత్తగా 20 ఇళ్ల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని చెప్పారు. కొండపై వాటర్ ట్యాంక్‌కు పైపులైన్లు అమర్చి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పారిశుధ్య పరిస్థితులు మెరుగుపరచాలని సూచించారు.

చిట్టివలస రైతుబజారు ప్రారంభించండి

చిట్టివలస రైతుబజారును సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మార్కెటింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు. రూ.78 లక్షలతో నిర్మించిన రైతుబజారులో 38 స్టాళ్లు ఉన్నాయని.. వీటిలో 27 రైతులకు, మిగిలినవి స్వయం సహాయక సంఘాలు, సూపర్‌బజారు అవసరాలకు కేటాయిస్తామని చెప్పారు. ఆయన వెంట కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, జెడ్పీ కనకమహాలక్ష్మి తదితరులున్నారు.



సత్యనారాయణపేట కొండవాలు ప్రాంతంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా